Surya 24/01/14

# జులై నెలలోనే మెట్రో ట్రయల్ రన్

## 2015లో ఉగాదికి ప్రయాణికుల ముందుకు

## రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించిన హెచ్ఎంఆర్ ఎండి

ఈ జులై నెలలోనే మెట్రో రైలు ట్రయల్ ప్రారంభించనున్నట్లు హెచ్ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పికె మహంతి దగ్గర జరిగిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మెట్రో రైలు పథకం పనులపై సమగ్రంగా వివరించారు. 35 కిలోమీటర్లలో 1150 పిల్లర్ల పునాదులను, ఇందులో 30 కి.మీ.ల్లో 1001 పిల్లర్లను, 25 కి.మీ.ల వరకు 8205 సెగ్మెంట్లను పూర్తి చేశామని ఆయన వివరించారు. మొదటి దశలోని నాగోలు- మెట్టుగూడ ప్రాంతంలో ట్రాక్ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రదేశంలో వచ్చే సంవత్సరం (2015) ఉగాది రోజున ప్రయాణికులకు అందుబాటులోకి మెట్రోరైలు ప్రవేశపెడతామని ఎండి తెలిపారు. ఈ సందర్భంగా పికె మహంతి మాట్లాడుతూ మెట్రో రైలు దేశంలోనే అత్యున్నతంగా సిద్ధమవుతోన్న పథకమని, ఈ పథకం పూర్తిచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగవు అధికారులు మనస్ఫూర్తిగా మద్దతుగా ఉంటూ సహకారాన్ని అందించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగిస్తూ, నీటిలైన్‌లను, మురుగునీటి లైన్‌లను, విద్యుత్ కేబుల్స్‌ను తరలించేందుకు తమ వంతు బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, జలమండలి, విద్యుత్ విభాగాల వారు సౌకర్యాలను కల్పిస్తూ పథకం పూర్తయ్యేలా తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు.

– మేజర్‌న్యూస్, సిటీబ్యూరో.

